

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో



జీపీలకు నజరానాలేవీ?

నాలుగు సంవత్సరాలు గడిచినా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇప్పటి వరకు నజరానా ఇవ్వడం లేదు.

- 9లో

గరిష్టం/కనిష్టం
43° / 29°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

కొర్రీలు.. కోతలు!

మిల్లర్ల ఇష్టారాజ్యం

- 'ఎ' గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా ధ్రువీకరణ
- తరుగు పేరుతో తూకంలో కోత
- కలెక్టరేట్‌కు తరలివచ్చిన రైతులు
- గేట్ వద్ద వడ్లు పోసి ధర్నా
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద ధర్నా చేస్తున్న బీబీనగర్ మండల రైతులు

సాక్షి, యాదాద్రి : అన్నదాత ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు 'ఎ' గ్రేడ్‌గా నిర్దేశించి పంపిన ధాన్యాన్ని మిల్లర్లు బి గ్రేడ్‌గా పరిగణిస్తున్నారు. అంతేకాదు.. వివిధ కారణాలు చూపి క్వింటాకు మూడు నుంచి నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్ల మాయాజాలంలో నష్టపోతున్న రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ధాన్యం కుప్పగా పోసి ఆందోళన చేపట్టారు.

మిల్లర్లపై ఫిర్యాదుల వెల్లువ

మిల్లర్ల తీరుపై విసిగిపోయిన రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. భువనగిరి, రాజాపేట, బీబీనగర్, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట మండలాల్లోని మిల్లుల వద్ద తక్కువ తూకం చూపడమే కాకుండా తరుగు తీస్తున్నారని, ఏ గ్రేడ్ ధాన్యాన్ని బీ గ్రేడ్‌గా మారుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొర్రీలు పెడుతూ రోజులు తరబడి ధాన్యం దించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న రైతులు వాపోతున్నారు.

రైతుల ఆందోళన

నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని తీసుకెళ్తే మిల్లర్లకు కొర్రీలు పెడుతూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, చిన్నరావులపల్లి, మక్తా అనంతారం, గొల్లగూడెం, రావిపహాడ్, ముగ్దుంపల్లి, మాదారం గ్రామాలకు చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళనకు దిగారు. ప్రధాన గేట్ ఎదుట వడ్లు కుప్పగా పోసి ధర్నా చేశారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టి, తూర్పార బట్టి మిల్లులకు ఏగ్రేడ్ ధాన్యాన్ని పంపినా మిల్లర్లు బీ గ్రేడ్‌గా పరిగణిస్తున్నారని, తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు, టెక్నికల్ టీంలు ఏ గ్రేడ్‌గా నిర్దేశించిన తర్వాత మిల్లుల వద్ద బీ గ్రేడ్ తగ్గించారని రైతులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బాల్‌రెడ్డి చిన్నరావులపల్లి కొనుగోలు కేంద్రానికి గత నెల చివరి వారంలో 700 బస్తాల ధాన్యం తెచ్చాడు. ఈనెల 10న టెక్నికల్ సిబ్బంది ధాన్యాన్ని పరిశీలించి 'ఎ' గ్రేడ్‌గా ధ్రువీకరించారు. కాంటా వేసి పెద్దరావులపల్లిలోని సోమేశ్వర రైస్ మిల్లుకు తరలించారు. మిల్లరు ధాన్యంలో కాగితాలు, నల్లగా ఉందని, క్వింటాకు రెండున్నర కిలోలు తరుగు తీస్తామని, ఆ విధంగా అయితేనే ధాన్యం దించుకుంటామని నిబంధన విధించాడు. చేసేది లేక కిలోన్నర ఇవ్వడానికి బాల్‌రెడ్డి ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో రైతు కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ సీసీ రైతుకు ఫోన్ చేసి సంబంధిత అధికారితో మాట్లాడించారు. ముందు ఒప్పుకున్న ప్రకారం కిలోన్నర తరుగు తీసుకుని ధాన్యం దించుకుంటారని అధికారి రైతుకు చెప్పారు. మరుసటి రోజు రైతుకు లారీ డ్రైవర్ ఫోన్ చేసి కలెక్టర్ ఫిర్యాదు చేసినందున మిల్లరు ధాన్యం దించుకోలేదని చెప్పాడు. 5 రోజుల తర్వాత పోచంపల్లి మండలంలోని మరో మిల్లుకు పంపగా.. అక్కడ క్వింటాకు 4 కిలోల చొప్పున తరుగు తీయడంతో పాటు బి గ్రేడ్‌గా పరిగణించినట్లు తెలిసింది.



మిల్లర్లపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీబీనగర్ మండల రైతులు

రైతులను దోపిడీ చేస్తున్నారు



ప్రజాప్రతినిధులు, మిల్లర్లు కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు, టెక్నికల్ టీంలు ఏ గ్రేడ్‌గా నిర్ణయించిన ధాన్యాన్ని మిల్లర్లు బ్రీ గ్రేడ్‌గా మారుస్తున్నారు. తరుగు పేరుతో క్వింటాకు నాలుగు కిలోలు కోత పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు తెచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు పెట్టకుండా తీసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సీఎం, మంత్రి, కలెక్టర్ వచ్చి చెప్పినా ధాన్యం తీసుకోమని అంటున్నారు. రైతులకు న్యాయం చేయాలి.

– నేదునూరి మహిపాల్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

సాక్షి, యాదాద్రి : మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా, తరుగు తీయకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని, రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మిల్లర్లు, అధికారులతో సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ధాన్యం దిగుమతిలో జాప్యం జరగకుండా చూడాలని, అవసరమైతే ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తూర్పారబట్టి తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ అధికారులు, టెక్నికల్ సిబ్బంది అలసత్వం వహించవద్దని, కాంటా వేసిన వడ్లను ఏ రోజుకారోజు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులు ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపీ కృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంపా నాగేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆలగడప బాలుడు.. భారత గ్రాండ్‌మాస్టర్

- 15 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన ప్రణీత్
- చెస్‌లో అత్యున్నత స్థాయికి చేరుకున్న క్రీడాకారుడు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తొలిసారి గ్రాండ్‌మాస్టర్ అయిన ప్రణీత్‌కు పలువురి అభినందనలు



మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన ఉప్పల ప్రణీత్ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ సాధించాడు. భారతదేశం నుంచి ఈ ఘనత సాధించిన 82వ ఆటగాడిగా ప్రణీత్ నిలిచాడు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రం నుంచి 5వ గ్రాండ్ మాస్టర్ హోదా పొందాడు. చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా రావాలంటే మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతో పాటు ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటాలి. అయితే అజర్‌బైజాన్‌లో జరిగిన బకూ ఓపెన్‌లో టోర్నీలో ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. గ్రాండ్‌మాస్టర్ హోదాకు కావాల్సిన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించిన ప్రణీత్ 15 ఏళ్ల వయస్సులో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్నాడు. ఉమ్మడి జిల్లా నుంచి తొలిసారి గ్రాండ్‌మాస్టర్ ఘనత సాధించిన ప్రణీత్‌కు పలు క్రీడా సంఘాలు, క్రీడాకారులు, ఆలగడప గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

హైదరాబాద్‌లో స్థిర నివాసం

మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామానికి చెందిన ఉప్పల శ్రీనివాసచారి, ధనలక్ష్మి దంపతుల కుమారుడు ప్రణీత్. శ్రీనివాసచారి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (సీటీఓ)గా, ధనలక్ష్మి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. కొనేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆలగడపలో వీరికి సొంత ఇల్లు, భూములు ఉన్నాయి. ప్రతి పండుగకు, శుభకార్యాలకు, సెలవుల్లో స్వగ్రామానికి వస్తుంటారు.



తల్లిదండ్రులు, సోదరుడితో ప్రణీత్

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రణీత్ చెస్‌లో రాణిస్తున్నాడు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు వచ్చినా.. కుమారుడి కెరీర్ ఆగిపోవద్దనే ఉద్దేశంతో వారు ఫ్లాట్‌ను సైతం విక్రయించి ప్రణీత్ చెస్‌లో రాణించేందుకు అండగా నిలిచారు. విదేశాల్లో టోర్నీల శిక్షణ కోసం ఎంతో ఖర్చు పెడుతూనే ఉన్నారు. కొన్నిసార్లు ఓటమి ఎదురై ప్రణీత్‌కు నిరాశ కలిగినా.. పట్టుదలతో విజయాల వైపు సాగిపోయాడు. 2021 వరకు రామరాజు వద్ద శిక్షణ పొందిన ప్రణీత్, ప్రస్తుతం ఇజ్రాయిల్‌కు చెందిన కోచ్ విక్టర్ మెకలెవిస్కి వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

ప్రణీత్ సాధించిన విజయాలు

- అండర్–7లో రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచాడు.
- 2015లో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ జీఎం టోర్నీలో 220 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించి ఒకే ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పాయింట్లు గెలిచిన ఆటగాడిగా జాతీయ రికార్డు సృష్టించాడు.
- అదే ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.
- 2018లో అండర్–11లో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచాడు.
- 2021లో అండర్–14 జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు.
- ఆసియా దేశాల ఆన్‌లైన్ చెస్ టోర్నీలో స్వర్ణం సాధించాడు.

ఎంతో సంతోషంగా ఉంది

చెస్‌ను ఆన్‌లైన్‌లో ఆడడం కంటే, నేరుగా బోర్డుపై ఆడడానికే ప్రాధాన్యమిస్తా. బ్లిడ్జ్, ర్యాపిడ్ కంటే క్లాసికల్ విభాగం అంటేనే నాకిష్టం. బలమైన ప్రత్యర్థిపై గెలుపుతో పాటు గ్రాండ్ మాస్టర్ హోదా కూడా దక్కింది. గ్రాండ్ మాస్టర్ హోదా సాధించినందుకు సంతోషంగా ఉంది. ఐదున్నరేళ్ల వయస్సులోనే చెస్ ఆడటం మొదలెట్టా. చిన్నప్పుడు టెన్నిస్ ఆడేవాడిని. ఈతలోను ప్రవేశం ఉంది కానీ ఓ రోజు నాన్న చెస్ ఆడతుండగా చూసి ఆసక్తి కలిగింది. నా ఇష్టాన్ని గమనించి అమ్మానాన్న నన్ను ప్రోత్సహించారు. కార్ల్‌సన్‌ను ఆరాధిస్తా. ఇక నా రేటింగ్‌ను 2800కు పెంచుకునేందుకు కృషి చేస్తున్నా. ప్రపంచ చాంపియన్‌గా నిలవడంతో పాటు ఒలింపిక్‌లో దేశానికి పతకం అందించడమే నా లక్ష్యం.

– ఉప్పల ప్రణీత్, గ్రాండ్ మాస్టర్

న్యూస్‌రీల్

భానుడు @ 43



యాదాద్రి కొండపై ఎండకు కాళ్లు కాలుతుండడంతో పరుగులు తీస్తున్న భక్తులు

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు.. సోమవారం కూడా ఏ మాత్రం తగ్గ లేదు. జిల్లాలో సగటున 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా వలిగొండ మండలంలో 43.2, అత్యల్పంగా బీబీనగర్ మండలంలో 31.9 డిగ్రీలుగా రికార్డయ్యింది. మూడు నాలుగు మండలాలు మినహా మిగతా అన్ని చోట్ల 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 6 గంటల వరకు వేడి తగ్గడం లేదు. ఎండ తీవ్రతకు జనసంచారం తగ్గడంతో రహదారులు బోసిబోయి కనిపిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

భువనగిరిటౌన్ : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌తో బతకలేకపోతున్నామని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో జూన్ 5నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, యాదగిరి, వెంకటేష్, రమేష్, రాజు, యాదయ్య, ఎల్లయ్య, ఉమాదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనారసింహుడికి లక్ష పుష్పార్చన



పుష్పార్చన నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సోమవారం స్వామి, అమ్మవారికి లక్ష పుష్పార్చన పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అర్చన గావించారు. తులసీదళాలతో అర్చన చేశారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మహాశివుడికి విశేష పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారికి నిత్య పూజలు చేసిన అనంతరం మండపంలో నిత్య రుద్ర హవనం, అభిషేకం, అర్చనలు గావించారు. గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణం, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి క్షేత్రంలో నిత్య పూజలు కొనసాగాయి. సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.35,45,667 సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ సర్కారుకు గుణపాఠం తప్పదు

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ సర్కారుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు పక్కీర్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ వెంకటేష్, మాజీ ఎంపీపీ శ్రీరాములు కలమ్మలతో పాటు మరో 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల ఓట్ల కోసం దళితబంధు పేరుతో డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. కమీషన్ల బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రజలకు విముక్తి కల్పించే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు.. కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ఏనాడూ అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల గణేష్, ఇందిర, రాజిరెడ్డి, ఆరోగ్యమ్మ, సంతోష్, బాలకృష్ణ, వెంకటేష్, ప్రదీప్, అంజిరెడ్డి, వంశీ, చంద్రమ్మ, జయమ్మ, పద్మ, శ్యామల, కరుణాకర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

- మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ప్రభుత్వ విప్ వినతి



మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ పంచాయతీ రాజ్, గిరిజన శాఖల మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మంత్రి సత్యవతి రాథోడ్‌ను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం సచివాలయంలో కలిసి వినతిపత్రాలు అందజేశారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు, కొత్త రోడ్లకు, రెన్యూవల్ రోడ్లకు నిధులివ్వాలని మంత్రి దయాకర్‌రావును కోరారు. తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్, జేతురాంతండా పంచాయతీలోని సంగ్యాతండాను నూతన పంచాయతీలు ఏర్పాటు చేయాలని గిరిజన మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. బంజారా భవనం, మహిళా ప్రాంగణ భవనం మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ విప్ సునీత తెలిపారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలపై దరఖాస్తులు ఇచ్చిన వారిని తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వివిధ సమస్యలపై 15 ఫిర్యాదులు రాగా అత్యధికంగా రెవెన్యూకు సంబంధించినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు ఇలా..

- గొర్రెల పెంపకం కోసం ప్రభుత్వ భూముల్లో శాశ్వత షెడ్లు నిర్మించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు ముత్యాలు వినతిపత్రం అందజేశారు.
- భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని అన్ని క్రీడలు ఆడేందుకు వీలుగా తీర్చిదిద్దాలని వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అవతార్ విన్నవించారు.
- రసాయన వ్యర్థాలను వదిలి నీటిని, వ్యవసాయ భూములను కలుషితం చేస్తున్న కంపెనీలను మూసివేయాలని కోరుతూ పోచంపల్లి మండలం దోతిగూడెం సర్పంచ్ పగిళ్ల స్వప్న ఆధ్వర్యంలో దరఖాస్తు అందజేశారు. కాలుష్యం వల్ల పంట దిగుబడి రాక అప్పుల పాలవుతున్నామని పేర్కొన్నారు.
- సదరం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ కావడం లేదని రాజాపేటలోని భవిత కేంద్రం చిన్నారులు ఝాన్సీ, జానుకలెక్టర్‌ను కలిసి విన్నవించారు. మల్టీ డిజబిలిటీతో బాధపడుతున్నామని కలెక్టర్‌కు తెలియజేశారు. వీరితో పాటు సంయుక్త, వర్షిత అనే చిన్నారులు కూడా సదరం సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ కావడం లేదని దరఖాస్తు ఇచ్చారు. కలెక్టర్ స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
- పింఛన్ ఆగిపోయిందని 98 ఏళ్ల వృద్ధురాలు తన మనుమడితో కలిసి కలెక్టరేట్‌కు వచ్చింది. తన భర్త కొంతకాలం క్రితం చనిపోవడంతో పింఛన్ వస్తుందని, మూడు నెలలుగా ఆగిపోయిందని కలెక్టర్‌కు తెలియజేశారు.

కళ్లు తిరిగి పడిపోయిన మహిళ

సమస్యలపై వినతిపత్రం అందజేయడానికి కలెక్టరేట్‌కు ఎండలో వచ్చిన లక్ష్మమ్మ సమావేశ మందిరంలో కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెతో వచ్చిన సహాయకులు మంచి నీరు తాగించడంతో కోలుకుంది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కానిస్టేబుల్‌కు కాంస్య పతకం



కాంస్య పతకంతో అనిల్‌కుమార్

భువనగిరి : దక్షిణ కొరియాలో జరుగుతన్న ఏషియన్ పసిఫిక్ మాస్టర్ గేమ్స్ – 2023 పోటీల్లో భువనగిరిలోని హన్మాన్‌వాడ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ అంబోజ్ అనిల్‌కుమార్ ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. అనిల్‌కుమార్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య తదితరులు అభినందించారు.

అలైన్‌మెంట్ మార్చాలని తీర్మానం చేయాలి

- గూడూరు నారాయణరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నారాయణరెడ్డి

భువనగిరి : రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి భువనగిరి మున్సిపాలిటీలో తీర్మానం చేయించి నిబద్ధత చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో నిర్వహించిన దుర్గమ్మ జాతరలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం తనను కలిసిన భూ నిర్వాసితులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గం నుంచి కాకుండా గతంలో నిర్ణయించిన ప్రకారం ఆలేరు నియోజకవర్గం గుండా అలైన్‌మెంట్ మార్చే విధంగా తీర్మానం చేసి సీఎం కేసీఆర్ పంపాలన్నారు. భువనగిరి నియోజకవర్గ పరిధిలో రీజనల్ రింగ్ రోడ్డు వెళ్లడంతో సుమారు వెయ్యి మంది రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని అలైన్‌మెంట్ మార్పుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసితులు ఆవిశెట్టి పాండు, బొజ్జ శివ, నవీన్, భాను, భిక్షపతి, గడ్డమీది మల్లేష్, కోటాల అనిల్, అయిలయ్య, నర్సింహ్మా, రమేష్, జహంగీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి



సంఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన కామల్ల వెంకటేష్(35) నల్లగొండలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం బంధువుల అంత్యక్రియలకు స్వస్థలానికి వెళ్లాడు. తిరిగి సోమవారం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో తిప్పర్తి మండలం పెద్దసూరారం సమీపంలో నల్లగొండ నుంచి నకిరేకల్ వైపునకు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొట్టడంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేష్ సోదరుడు మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

చౌటుప్పల్ : హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని యాదాద్రి జిల్లా ఫుడ్ సేఫ్టీ డీజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి తెలిపారు. మండల పరిధిలోని లింగోజిగూడెం గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంట ఉన్న పలు హోటళ్లలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. లింగోజిగూడెంలోని ఓ ప్రధాన హోటల్‌లో పరిసరాలు, వంట గదిలో అపరిశుభ్రతను గుర్తించారు.నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వ ఉన్న సామగ్రి, ఆహారపదార్థాల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటళ్లలో ప్రజలకు అందించే ఆహారం విషయంలో అన్ని నిబంధనలు పాటించాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరించినా, కల్తీ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గీత కార్మికుడికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండ రాజు రోజువారీలాగానే సాయంత్రం కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు తీవ్ర గాయాలైన అతడిని వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

వాహన యజమానులపై కేసు

భువనగిరి : ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని, ట్యాంపరింగ్ చేసిన సుమారు 65 వాహనాల యజమానులపై కేసు నమోదు చేశారు. అనంతరం కొంత మంది వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకటేష్, విజయకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టి..

- గాల్లోకి లేచి బస్సును ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడి దుర్మరణం
- బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయాలు.. ప్రయాణికులు క్షేమం
- చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఘటన



పెద్దకాపర్తి శివారులో ప్రమాదానికి గురైన కారు

చిట్యాల : అతివేగంతో వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి తొలుత డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం గాల్లోకి లేచి అవతలి వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి తిరిగి డివైడర్ మధ్యలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందగా బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన డ్రైవర్ నాగబాబు మరో వ్యక్తితో కలిసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో గుర్తుతెలియని యువకుడు వీరిని లిఫ్ట్ అడిగి కారు వెనుక సీట్లో కూర్చొని ప్రయాణిస్తున్నాడు.

తొలుత డివైడర్‌ను ఢీకొట్టి..

నాగబాబు కారు అతివేగంతో ప్రయాణిస్తూ చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారు హోటల్–7 వద్దకు రాగానే అదుపుతప్పింది. దానిని అదుపు చేసేందుకు డ్రైవర్ చందూరి నాగబాబు బ్రేక్ వేయగా అక్కడే ఇసుక ఉండటంతో పూర్తిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం వేగంతో ఉన్న కారు గాల్లోకి లేచి హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి తిరిగి డివైడర్ మధ్యలోకి వచ్చి పడింది.

లిఫ్ట్ అడిగి.. మృత్యుఒడికి

అయితే, ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవర్ నాగబాబుతో పాటు మరో ఇద్దరు ఉన్నారు. అంతకుముందే ఓ గుర్తుతెలియని యువకుడు హైదరాబాద్ వెళ్లేందుకు నాగబాబు కారు ఎక్కి వెనుకసీట్లో కూర్చున్నాడు. అయితే, ప్రమాద సమయంలో కారు వెనుక సీట్లో సీటు బెల్టు పెట్టుకోకుండా కూర్చున్న గుర్తుతెలియని యువకుడు (26) రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు గాల్లోకి లేచిన సమయంలో ఆర్టీసీ బస్సును కుడివైపున ఢీకొట్టడంతో డ్రైవర్ చిన్న అంజయ్యకు స్వల్ప గాయాలు కాగా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. ఈ సమయంలో బస్సులో 28మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం మేరకు ఎస్‌ఐ నకిరేకంటి ధర్మా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతిచెందిన యువకుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



రాంసింగ్ (ఫైల్)

రాజాపేట : విద్యుదాఘాతంతో ఓ లైన్‌మన్ మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్లలోడుతో వస్తున్న లారీ రేణికుంట గ్రామం కొత్తకాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్‌మన్ గుగులోతు రామ్‌సింగ్ (48) సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు సరిచేసేందుకు ఎల్సీ తీసుకున్నాడు. తీగలను సరిచేసి ఎల్సీ రిటన్ చేశాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌పై మంటలు రావడంతో తిరిగి ఎల్సీ తీసుకుని దానిని ఎక్కాడు. ఆ స్తంభానికి పైభాగంలో ఉన్న మరో లైన్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న సంగతి రామ్‌సింగ్ గమనించలేదు. అతను ఆ తీగలకు తగలడంతో వెంటనే విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు సబ్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రామ్‌సింగ్‌ను కిందికి దించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం రామ్‌సింగ్ మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, రామ్‌సింగ్ స్వగ్రామం జనగామ జిల్లా దేవరుప్పల మండలంలోని పడమటి తండా. ఇతడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



సైదులు (ఫైల్)

గరిడేపల్లి : లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం గరిడేపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన షేక్ సైదులు(30) తన తమ్ముడు షేక్ లాల్‌పాష బంధువు షేక్ అబ్బాస్‌తో కలిసి అప్పన్నపేట నుంచి గరిడేపల్లికి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న సైదులు తీవ్ర గాయాలై అక్కడిక్కకడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న లాల్ పాష, అబ్బాస్‌లకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఆయేషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. నలుగురి అరెస్ట్

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపాలెం మండలం దొండపాడులో ఆదివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనఖీల్లో ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి బెల్లం, పటికను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, 60 కేజీల బెల్లం, 20 కేజీల పటిక, 7 లీటర్ల సారా, రూ.42 వేల నగదు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారించగా మఠంపల్లి మండలం కాల్వపల్లితండా, కొత్తతండాకు చెందిన భూక్యా బాబు, బాణోతు లాకుగా తేలింది. వీరిచ్చిన సమాచారంతో ప్రోత్సహిస్తున్న జగ్గయ్యపేటకు చెందిన సంకా శ్రీనివాసరావును అరెస్ట్ చేసారు. ముగ్గురిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మఠంపల్లి మండలంలో సంయుక్త దాడులు

మఠంపల్లి మండలంలోని కొత్తతండా, జామ్లా నాయక్‌తండా, బిల్యానాయక్ తండాలలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సోమవారం సంయుక్త దాడులు నిర్వహించారు. జామ్లా తండాకు చెందిన కమిలీ వద్ద 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఆమెను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఉప సర్పంచ్ మెడలోంచి పుస్తెలతాడు చోరీ



సంఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న ఏసీపీ నర్సింహారెడ్డి

తుర్కపల్లి : దుండగులు ఉప సర్పంచ్ మెడలోంచి పుస్తెలతాడును చోరీ చేశారు. ఈ ఘటన తుర్కపల్లి మండలంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చోక్లతండా పరిధిలో గల కోక్యతండాకు చెందిన సభావట్ సునీత ఆదివారం రాత్రి భర్త నరేశ్‌తో కలిసి ఇంటి ఆవరణలో నిద్రపోయింది. ఈ తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సునీత మెడలోంచి మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కున్నారు. బాధితురాలు కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. మధ్యరాత్రి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ చేరుకొని పరిశీలించారు. సోమవారం ఉదయం ఏసీపీ నర్సింహారెడ్డి సందర్శించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

తొమ్మిది ట్రాక్టర్లు, రెండు జేసీబీల పట్టివేత

మోత్కూరు : ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలపై సోమవారం సాయంత్రం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మండలంలోని పాడిచేడు గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తున్న 9 ట్రాక్టర్లను, 2 జేసీబీలను ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకొని తమకు అప్పగించారని మోత్కూరు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బీసీ కాలనీలో దొంగల హల్‌చల్



కాలనీలో సంచరిస్తున్న దుండగులు

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం తెల్ల వారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. వేకువజామున 3:15 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు కాలనీ వీధుల్లోకి వచ్చారు. ఎం .పరుశరాములు అనే వ్యక్తి బైక్‌ను అపహరించుకుపోయారు. మరో ఇద్దరి బైక్‌లను చోరీ చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇదంతా కూడా సీసీ కెమరాల్లో రికార్డు అయ్యింది.బాధితుడు పరుష రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను చెప్పారు.

శ్రీవల్లిటౌన్‌షిప్ 5వ విడత వేలం

- 25న ప్రీబిడ్ సమావేశం

నల్లగొండ : రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్ షిప్ ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు జూన్ 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఐదో విడత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం నియమ నిబంధనలు, ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు మే 25న ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు విడతలుగా నిర్వహించిన వేలం తర్వాత మిగిలిన 59 ఓపెన్ ప్లాట్‌లు, 209 పాక్షిక నిర్మాణ గృహాలకు ఐదో విడతలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓపెన్ ప్లాట్లకు చదరపు గజానికి రూ.6 వేలు, పాక్షిక నిర్మాణ గృహాలకు నిర్మాణ దశలు అనుసరించి చదరపు గజానికి రూ.6 వేల నుంచి రూ.10,500గా కనిష్ట ధర నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 91543 39209 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

‘పేట’లో గుర్తుతెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

సూర్యాపేట క్రైం : గుర్తుతెలియని మహిళ(32) మృతిచెందింది. ఈ ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని సద్దుల చెరువు సమీపంలో పసుపు కలర్ ప్యాంట్, పింకు కలర్ టాప్ ధరించిన మహిళ మృతి చెంది ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతదేహం సమాచారం తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అయితే, ఆ మహిళ ఏ కారణంతో చనిపోయిందనే వివరాలు తెలియరాలేదని తెలిపారు.

కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు

రామగిరి(నల్లగొండ), నార్కట్‌పల్లి, చిట్యాల : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం ఆయన తిప్పర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. చిట్యాల, వట్టిమర్తి గ్రామాల పరిధిలోని పలు రైస్‌మిల్లులను పరిశీలించారు. నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది పంట ఎక్కువగా పండిందని.. ఇప్పటికే 60శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. .ఆయన వెంట ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల డీఎం నాగేశ్వరరావు, డీసీఓ శ్రీనివాస్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నల్లగొండ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

జూన్ 5నుంచి సమ్మె చేస్తాం

- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్లు



నల్లగొండ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

నల్లగొండ : జూన్ 4వ తేదీలోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేపడతామంటూ డీలర్లు పేర్కొంటున్నారు. ఈమేరకు సోమవారం నల్లగొండ జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో డీలర్లు అంతా సమ్మె నోటీసుకు సంబంధించిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా పారేపల్లి నాగరాజు మాట్లాడుతూ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించినా నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కమిషన్ పెరగకపోవడంతో కుటుంబం పోషించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, కోశాధికారి సూర్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, బుర్రి శంకర్‌నాయక్, మండలాధ్యక్ష కార్యదర్శులు, డీలర్లు పాల్గొన్నారు.


వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి : వేర్వేరు చోట్ల ఉరేసుకుని ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. భూదాన్ పోచంపల్లి, కనగల్, తుర్కపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, కుసుమంచి మండలం, నర్సింహులగూడేనికి చెందిన హార్వెస్టర్ యజమాని, ఆపరేటర్ శీలం ఉపేందర్(33) వరికోతలు కోయడానికి 15రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కో డ్రైవర్ షేక్ మస్తాన్‌ను వెంట తీసుకొని భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి వచ్చాడు. పిలాయిపల్లిలో బందారపు రాములు ఇంట్లో గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన ఓ రైతు వరిచేను కోయడానికి వెళ్లారు.మధ్యాహ్నం సమయంలో ఉపేందర్‌కు ఫోన్ రావడంతో రూమ్‌కు వెళ్లి భోజనం చేసి, వచ్చేటప్పుడు తనకు కూడా భోజనం తీసుకొని వస్తానని కో డ్రైవర్ మస్తాన్‌కు చెప్పి వెళ్లాడు. కానీ సాయంత్రం నాలుగు గంటలైనా రాకపోయే సరికి మస్తాన్ రూమ్ వద్దకు వచ్చాడు. లోపలినుంచి గడియపెట్టుకొని ఉండటంతో ఎంత పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా ఉపేందర్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. వెంటనే ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. విషయాన్ని ఫోన్‌ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, గ్రామంలో జరుగుతున్న భూ తగాదాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని ఉపేందర్ భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

వాసాలమర్రిలో..

తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో గుర్తుతెలియని మహిళ (45) బీసీ కమ్యూనిటీ హాల్ వెనక భాగంలో ఉన్న చిన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకొని మృతిచెందింది. సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీం పరిశీలించారు. వీఆర్‌ఏ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

మద్యానికి బానిసై..



శీలం ఉపేందర్ మృతదేహం

కనగల్: కనగల్ మండల కేంద్రానికి చెందిన కురెంద్ర ప్రదీప్ అలియాస్ చంటి (31) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కాపురానికి రాకపోవడంతో తల్లి జ్యోతి వద్దే ఉంటున్నాడు. ఐదేళ్లుగా మద్యానికి బానిసైన ప్రదీప్ గతంలోనే రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే ప్రదీప్ ఆదివారం బాగా మద్యం సేవించి రాత్రి 10గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి స్లాబ్ కొండికి తాడుతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోపే మృతిచెందాడు. సమాచారం మేరకు ఎస్‌ఐ నాగేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను స్థానిక జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంను అడిగి తెలుసుకున్నారు. ప్రదీప్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

గండిచెరువులో మునిగి ఇద్దరు మృతి



గండి చెరువులో నుంచి మృతుడిని తీసి వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయ పరిసరాల్లోని గండిచెరువులో మునిగి ఇద్దరు మృతి చెందారు. హైదరాబాద్ జగద్గిరిగుట్ట సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వనమాల పవన్‌కుమార్ (19), దండే కార్తీక్ (22) ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చారు. శ్రీస్వామివారిని దర్శించుకున్న తరువాత పట్టణంలో ఓ సత్రంలో కుటుంబ సభ్యులతో బస చేసేందుకు దిగారు. అక్కడే వంటలు వండుకున్న తరువాత పవన్ కుమార్, దండే కార్తీక్‌లు ఇద్దరు శ్రీస్వామిని మళ్లీ ఒకసారి దర్శనం చేసుకుంటామని సాయంత్రం చెప్పి వెళ్లారు. రాత్రి 10గంటలైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు చెందారు. అదే రాత్రి చుట్టు పక్కల, కొండపై వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో సోమవారం మధ్యాహ్నం సమయంలో పవన్‌కుమార్, కార్తీక్ మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సాయంత్రం 6గంటల ప్రాంతంలో గండి చెరువులో ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని, ఉదయం మిస్సింగ్ కేసు ఇచ్చిన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పవన్ కుమార్, కార్తీక్‌ల కుటుంబ సభ్యులు వచ్చి, చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుల బంధువైన శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరు సాయంత్రం సమయంలో గండి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడినట్లు పోలీసులు చెబుతున్నారు.

మతతత్వ దేశంగా మార్చేందుకు కుట్ర

- చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్ : భారత్‌ను మతతత్వ దేశంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్ణాటక ప్రజలు బీజేపీ మతోన్మాద హిందుత్వ విధానాన్ని తిప్పికొట్టడంలో సఫలీకృతమయ్యారని తెలిపారు. మతోన్మాద హిందుత్వ భావాలను ఇతర రాష్ట్రాలు వ్యతిరేకించడానికి సిద్ధంగా ఉన్నాయని 2024 ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. బండి సంజయ్ చేసే హిందూ ఏకతాయాత్ర భారత రాజ్యాంగాన్ని, దాని విలువలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ సెక్యులర్ భారతదేశంలో బీజేపీ మతోన్మాద విధానాలు ప్రజలకు వివరించేందుకు కోసం వామపక్షాలు సిద్ధమయ్యాయని తెలిపారు. బీజేపీ విధానాలు ఎండగట్టేందుకు సీపీఎం పోరాడుతుందన్నారు. సమావేశంలో కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరు మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, మాయ కృష్ణ, బొడ్డుపల్లి వెంకటేష్, జెల్లెల పెంటయ్య, ఎండి పాష, బండారు నరసింహ, గంగాదేవి సైదులు, గడ్డం వెంకటేష్, రాచకొండ రాములమ్మ, వనం ఉపేందర్, మద్దెపురం రాజు, నాయకులు బుర్రు అనిల్, ఈర్లపల్లి ముత్యాలు, గంటపాక శివ, సందేల రాజేష్, అన్నంపట్ల కృష్ణ, బండారు శ్రీరాములు, దూపటి వెంకటేష్ పాల్గొన్నారు.

దేశంలో ముందస్తు ఎన్నికలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : దేశంలో పార్లమెంట్ ఎన్నికలు ముందస్తుగా వచ్చే అవకాశం ఉందని.. పార్లమెంట్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని.. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి కేంద్ర ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. కర్నాటక ప్రజలు తెలివితో బీజేపీకి బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ కుట్రలను దేశ ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని గద్దె దింపి బుద్ధి చెపుతారన్నారు. తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనీయబోమని, లౌకిక పార్టీలతో పొత్తు తప్పని సరిగా ఉంటుందని వచ్చే ఎన్నికల్లో కమ్యునిస్టులు అసెంబ్లీలో అడుగు పెడతారని ధీమా వ్యక్తం చేశారు. దీని కోసం గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ నిర్మాణం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, వినోద్ నాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, పోలెబోయిన వరలక్ష్మి, రామ్మూర్తి, మంగారెడ్డి, పరశురాములు, అంజాద్, అయ్యూబ్, రొండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు నిడమనూరు దంపతులు



ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వద్ద జాతీయ జెండాను చూపుతున్న వెంకటరెడ్డి, విజయలక్ష్మి

నిడమనూరు : మండల కేంద్రానికి చెందిన చాపల వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులు ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ (5364 మీటర్లు) వరకు పర్వతారోహణ చేశారు. అక్కడ జాతీయ జెండాను ఎగురవేశారు. 20 మంది సభ్యుల బృందంతో నడక ప్రారంభించిన ఈ దంపతులు పొగ మంచుతో కూడిన వర్షంలో తడుస్తూ అత్యంత క్లిష్టమైన మార్గంలో పర్వతారోహణ చేశారు. వాతావరణం మరింత సంక్లిష్టంగా మారడంతో బేస్ క్యాంపు వద్ద నుంచే వెనుదిరిగారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో తాగునీటి తిప్పలు

భువనగిరి టౌన్: కలెక్టరేట్‌లో తాగునీరు లేక ప్రజావాణికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్‌లో వేడి నీరు వస్తున్నందున వేసవిలో ఈ నీటిని తాగేందుకు వీలు లేకుండా ఉంది. కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

తుర్కపల్లి: నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకులు కోరారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దయ్యబండతండా, బీల్యానాయక్‌తండా, రాంపూర్‌తండా, బాబుల్‌నాయక్ తండా, జేతురాంతండా, రామోజీనాయక్ తండాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ లలితశ్రీనివాస్, శత్రునాయక్, సాయికుమార్ నాయక్, దూప్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ సమావేశం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ వర్గానికి రిజర్వ్ అయినందున అభ్యర్థి ఎంపికపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా తూప్రాన్‌పేట మాజీ సర్పంచ్ అల్మాసిపేట కిష్టయ్య, చిన్నకొండూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చెక్క రాములు పేర్లను ఎంపిక చేసి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి సమర్పించారు. సమావేశంలో కౌన్సిలర్ బండమీది మల్లేష్, ఎంపీటీసీలు చిట్టంపల్లి శ్రీనివాస్‌రావు, బోయ ఇందిర సంజీవ, ఉపసర్పంచ్ బోయ యాదయ్య, నాయకులు తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఆలేరురూరల్: యాదవ కులస్తుల పట్ల అనుచితంగా మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆలేరు నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు గంగుల శ్రీనివాస్ యాదవ్, గాజుల లావణ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే 19న యాదాద్రి జిల్లాలో రహదారులను దిగ్బంధం చేస్తామని, 25న లక్ష మంది యాదవులతో గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వెంకటేష్‌యాదవ్, వేణుగోపాల్, చంద్రయ్య తదితరలు పాల్గొన్నారు.

సీపీఎం కౌన్సిలర్లపై ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీశైలం

చౌటుప్పల్: సీపీఎం కౌన్సిలర్లపై మున్సిపల్ చైర్మన్ చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం అన్నారు. సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం కౌన్సిలర్లు గోపగోని లక్ష్మణ్, దండ హిమబిందుఅరుణ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ నిర్ణయం మేరకు తాము చైర్మన్ ఎన్నిక సమయంలో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చామన్నారు. అదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తమపై భౌతిక దాడులకు దిగారన్న విషయాన్ని గుర్తు చేశారు. గతాన్ని మరిచి చైర్మన్ చిల్లర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చైర్మన్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట: కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి కోరారు. సోమవారం సిర్నెములలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, సర్పంచ్ ముత్యాల సుజాతరవి, వైద్యాధికారి అశ్వినికుమార్, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ చందస్వి పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

రాజాపేట: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సహ కార్యదర్శి సత్యంజీ కోరారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సహకార్యదర్శి భానుప్రసాద్, మండల అధ్యక్షుడు బోగ జ్ఞానేందర్, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, భజరంగ్‌దళ్ నాయకులు మార్క శివ పాల్గొన్నారు.

ఏలేందర్‌కు సన్మానం

మోటకొండూర్: మండల కేంద్రానికి చెందిన కంకల ఏలేందర్ ఓయూ నుంచి రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ఈసందర్భంగా కురుమ సంఘం నాయకులు సోమవారం ఆయనను స్థానికంగా సన్మానించారు. వారిలో కురుమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, విఠల్, బంగారి, నాగరాజు, ఇస్తారి ఉన్నారు.

ఏకగ్రీవ జీపీలకు నజరానాలేవీ?

- వలిగొండ మండలంలోని ఆరు గ్రామాలు ఏకగ్రీవం
- పాలకవర్గాల గడువు సమీపిస్తున్నా అందని ప్రత్యేక నిధులు

వలిగొండ: గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ప్రజలంతా ఐక్యంగా గ్రామ పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవం చేసుకుంటే అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.15లక్షలు నిధులు విడుదల చేస్తామని మంత్రి కేటీఆర్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈమేరకు వలిగొండ మండలంలో మొత్తం 37 గ్రామపంచాయతీల్లో 6 గ్రామాలు చిత్తాపురం, జంగారెడ్డిపల్లె, నరసాయగూడెం, మాందాపురం, నేమిలికాల్వ, మొగిలిపాక పంచాయతీలు పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. కానీ ఇప్పటికి నాలుగేళ్లు దాటినా నజరానా ఊసే లేదు.


జంగారెడ్డిపల్లెలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

నిధులు లేక..

అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు లేక ఏకగ్రీవ పంచాయతీలు నీరసించి పోయాయి. ప్రజలు పాలక వర్గాలపై ఉన్న నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, కానీ ఇప్పుడు నిధులు లేక గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించే స్థితిలో కూడా లేమని ఏకగ్రీవ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు పూర్తయ్యే సమయం దగ్గర పడుతోందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఏకగ్రీవ పంచాయతీలకు నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజలు కోరుతున్నారు

నమ్మకంతో ఏకగ్రీవం చేశారు



“ జంగారెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించగా పార్టీలకతీతంగా పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ చిన్నదికావడంతో ఏకగ్రీవం అయితే ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకోవచ్చని ఎన్నుకున్నారు. కానీ నిధుల సమస్య వేధిస్తుంది.

– శివరాత్రి ఎల్లమ్మ, సర్పంచ్, జంగారెడ్డిపల్లె

నిధులు మంజూరు చేయండి



“ నూతనంగా ఏర్పడ్డ నర్సాయగూడెం పంచాయతీలో నాపై నమ్మకంతో సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి నిధులు లేక అభివృద్ధి చేయలేకపోతున్నాం. ప్రస్తుతం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రకటించిన ప్రత్యేక నిధులు విడుదల చేస్తే అభివృద్ధి చేయొచ్చు.

– తుమ్మల దామోదర్, సర్పంచ్, నర్సాయగూడెం

రాష్ట్ర సంక్షేమ పథకాలు పేదలకు భరోసా

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు భరోసా ఇస్తున్నాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు, 26మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం పార్టీ ముఖ్యులతో సమావేశమై గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిబలరాం, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, కార్యదర్శి పోచబోయిన మల్లేశం, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బొక్క మాధవరెడ్డి, సర్పంచ్‌లు గుత్తా నర్సింహారెడ్డి, అప్పం లక్ష్మీనర్సు, పిట్ట కృష్ణారెడ్డి, రేఖ యాదయ్య, కోళ్ల స్వామి, మెట్టు మహేందర్‌రెడ్డి, ముత్యాల సుజాత, కడమంచి సంధ్య, బందెల యాదయ్య, నీల జయమ్మ, చెరుకు సోమయ్య, ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, గొరిగె నర్సింహ, దోమల సతీష్, గాదె పారిజాత, ఏనుగు పుష్పమ్మ నాయకులు పాల్గొన్నారు.


రామన్నపేటలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

హైవేపై వరుస వాహనాల ఢీ

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో సోమవారం ఒకదాని వెనుక మరొకటి చొప్పున వరుసగా నాలుగు వాహనాలు ఢీకొన్నాయి. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. ఈక్రమంలో గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద సదరు బస్సు తన ముందున్న కారును ఢీకొట్టింది. దీంతో ఆ కారు తన ముందున్న మరో కారును ఢీకొట్టగా.. ఆ ముందున్న కారు సైతం మరో కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సుతోపాటు మరో మూడు కార్లు దెబ్బతిన్నాయి. కాగా.. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మున్సిపాలిటీలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 14వ వార్డును సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో నెలకొన్న ప్రధాన మురుగు కాలువ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను సైతం త్వరలోనే చేపడుతామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తామని చెప్పారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ సందగళ్ల విజయసతీష్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఊడుగు రమేష్, తొర్పునూరి నర్సింహ, తాడూరి పరమేష్, గంగరాములు, వర్కాల రవి, ఢిల్లీ శంకర్‌రెడ్డి, తొర్పునూరి మల్లేష్, నర్సింహ, కిరణ్ తదితరులున్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పట్టణాలు, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతున్నాయని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని మహమ్మాయి కాలనీ, రాంనగర్, సాయినగర్‌లో డ్రెయినేజీ, రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, నాయకులు తదితరులున్నారు.


భువనగిరిలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు పనుల పరిశీలన

భువనగిరి: పట్టణంలోని సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం చౌరస్తా వరకు బీటీ రోడ్డు ఏర్పాటు పనులను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ముస్తాలపల్లి గ్రామంలో శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి ఆలయంలో గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణేశ్వర స్వామి, నవగ్రహ, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా హన్మాపురం గ్రామంలో అనారోగ్యానికి గురైన సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డిని పరామర్శించారు. అనంతరం డయాలసిస్ పేషెంట్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిట్టా వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, గోపాల్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామానికి చెందిన 10మంది కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయిలయ్య, రమేష్‌గౌడ్, శంకర్, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, మహేష్, పవన్ తదితరులున్నారు.

మైదానాన్ని అన్ని క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి


వినతిపత్రం అందజేస్తున్న అతహర్

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని కేవలం క్రికెట్‌కు మాత్రమే కాకుండా అన్ని క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అతహర్ మాట్లాడుతూ గతంలో ఈ మైదానంలో హాకీ, ఫుట్ బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, షటిల్ మొదలగు ఆటలు కొనసాగేవని తెలిపారు. నేడు అధికార పార్టీ వారు తమ స్వలాభం కోసం కేవలం క్రికెట్ మైదానంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్వి వెంకటేష్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరకాల రమేష్, పట్టణ అధ్యక్షులు సాయి నివాస్, మైనారిటీ సెల్ అధ్యక్షులు వాహేద్, యూత్ కార్యదర్శి రాకేష్, నాయకులు రమేష్,లతీఫ్, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప- కామరాతి దేవి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీమగాని రాములు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కవిడె మహేందర్, మాజీ సర్పంచ్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి

మోత్కూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 400 మంది రైతుల నుంచి 80 వేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఆయన వెంట ఏఈఓ జినుక సైదులు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ మామిడి కిషన్‌రావు, రైతులు ఉన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న కంచర్ల అశోక్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు


మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్: వరి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన భువనగిరి నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదని ఆరోపించారు. రైస్ మిల్లు యజమానులు ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించకపోగా ధరలు తగ్గించడం, తరుగు తీయడం లాంటి చర్యలకు పూనుకుంటున్నారన్నారు. ధాన్యాన్ని రవాణా చేయడానికి జిల్లా యంత్రాంగం లారీలను సరైన సమయానికి పంపించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలెపాక యాదయ్య, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, వస్తువుల అభిలాష్, సీపీఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీలు విజయవంతం చేయాలి

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. సోమవారం క్రీడాపోటీలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ మాజిద్, పీడీ భావన, పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే..

పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎం కప్ నిర్వహణకు ఏర్పాట్లు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో మంగళవారం, బుధవారం నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాపోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. సోమవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీఓ పద్మావతి పాల్గొన్నారు.

నేడు పోటీలు ప్రారంభం

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ప్రారంభించనున్నారని ఎంపీడీఓ కారం ప్రభాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు

ఆలేరురూరల్: కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు లాంటిదని పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఆలేరులో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లోనూ కర్ణాటక ఫలితాలు పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక బీజేపీ నాయకత్వం కుట్రలు పన్ని రాహుల్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించారని ఆరోపించారు. కార్యక్రమంలో చింతలపణి శ్రీనివాస్‌రెడ్డి, దశరథ, శ్రీపాల్‌రెడ్డి, శంకరయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనగాం ఉపేందర్‌రెడ్డి

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

మోత్కూరు: ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరు పట్టణంలోని పద్మశాలీ కాలనీలో వంగరి ధనమ్మ అధ్యక్షతన చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు వెంకటనర్సు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూలు, రంగులు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ పేరుతో పన్నులు వేస్తుందన్నారు. చేనేత సహకార సంఘాల ద్వారా చేనేతలకు పని కల్పించి వస్త్రాలను టెస్కో ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొంగరి రాములు, నాయకులు పసునూరి నారాయణ, రేగోటి యాదగిరి, రేగోటి శ్రీను, కస్తూరి సంజీవ, పసునూరి రమేష్, రేగోటి ఉషారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

బొమ్మలరామారం: మండల కేంద్రంలోని 50 సర్వే నంబరులో నక్ష బాటను కబ్జా చేసి, భవన నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ పద్మ సుందరికి వినతిపత్రం అందజేశారు. బొమ్మలరామారం నుంచి గట్టు మైసమ్మ ఆలయం పరిసరాల వరకు గల నక్షబాట.. తిర్మలగిరి నుంచి జియాపల్లి వరకు ఉంటుందని దీనిని కొందరు కబ్జా చేసి భవనాలను నిర్మిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కాగా.. ఎంఆర్‌ఐ వెంకట్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్ అక్కడకు చేరుకొని ప్రాథమిక విచారణ జరిపారు. మూడు రోజుల్లో పూర్తి స్థాయి సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

- **రాజ్యాంగ పుస్తకాలను అందించాలి**

భువనగిరిటౌన్: రాజ్యాంగ పుస్తకాలను పౌరులందరికీ ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ భువనగిరిలో సోమవారం ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల నరేందర్, సంజీవ్, గాలయ్య, నర్సింగ్, సురేష్, రాకేష్, మహేష్, సాయికుమార్, నరేందర్, నగేష్, సందీప్ ఉన్నారు.

- **నేటి నుంచి ఉర్సు**

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని దర్గాలో మంగళవారం నుంచి ఉర్సు నిర్వహించనున్నట్లు దర్గా ముతావలి ఎండీ సలీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

- **చలివేంద్రం ఏర్పాటు**

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో చౌటుప్పల్ దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యాకూబ్‌ఖాన్, సిబ్బంది రామచంద్రయ్య, లింగానాయక్, నరేందర్, పద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

- **అమ్మఒడి ఆశ్రమంలో అన్నదానం**

యాదగిరిగుట్ట రూరల్: మదర్స్ డే సందర్భంగా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ఉన్న అమ్మఒడి మానసిక వికలాంగుల అనాథాశ్రమంలో సోమవారం మహబూబ్‌పేట గ్రామానికి చెందిన మచ్చ సాయిరాం అన్నదానం నిర్వహించారు. అనంతరం సిబ్బందికి చీరలు బహూకరించారు. కార్యక్రమంలో ఆరె రాజేష్, రేగు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

- **భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన**

రాజాపేట: ఏకాదశి సందర్భంగా రాజాపేట మండల కేంద్రంలో సోమవారం భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణసాయి మందిరం అర్చకులు చలివేదుల రామకృష్ణ ప్రసాద్ శర్మ, భక్తులు హరేరామ హరేకృష్ణ నామాన్ని జపించారు. అనంతరం ఆలయంలో సామూహిక శతకోటి రామనామ జపనం, ప్రత్యేక భజన నిర్వహించారు. కార్యక్రమంలో నంగునూరి రాజు, నాళ్ల శేఖర్, పెద్ది సంతోష్, బెజుగం శ్రీను, శేఖర్, ఎక్కలదేవి సోమరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

- **ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

గుండాల: ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తాండ్ర అమరావతి కోరారు. గుండాల మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌ను సోమవారం పునఃప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందం వరలక్ష్మి, మేనేజర్ కందుల స్వామి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం అంజయ్య, బ్యాంకు సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **అంబేడ్కర్ విగ్రహానికి వినతి**

చౌటుప్పల్: ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వారిలో సంగిశెట్టి క్రిస్టఫర్, సంగిశెట్టి జనార్దన్, ఎస్‌కే మున్నా, కట్కూరి కిరణ్, గుంటోజు ఆంజనేయులుచారి, శంకర్, రవి, కృష్ణ తదితరులున్నారు.

- **వేతనాలు చెల్లించాలి**

భువనగిరి టౌన్: మైనార్టీ పాఠశాలలు, కళాశాలల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, వెంకటేష్, శోభన్‌బాబు, జహంగీర్ ఆసిఫ్, నఫీజ్, సుల్తాన్ ఉన్నారు.

- **అందుబాటులో జీలుగ విత్తనాలు**

భువనగిరి, యాదగిరిగుట్ట రూరల్, మోత్కూరు: జీలుగు, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఈఓ పావని, యాదగిరిగుట్ట మండల వ్యవసాయాధికారి రాజేష్, మోత్కూరు మండల వ్యవసాయ అధికారి కల్యాకరి స్వప్నలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 30 కిలోల జీలుగు బ్యాగు రూ. 843లు, 40 కిలోల జనుము బ్యాగు రూ. 1,225లు ఉన్నట్లు పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానికంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నివార్డుల్లో రూ.10 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు, రూ.20లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులతో పాటు రూ.6 లక్షలతో ముక్తాపూర్, రేవనపల్లి శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కొంగరి కృష్ణ, సుర్కంటి జ్యోతి, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, భోగ భానుమతివిష్ణు, కుడికాల అఖిల, దేవరాయ కుమార్, కోఆప్షన్‌సభ్యులు జల్ది నర్సింహ, సయ్యద్ అజ్గర్, మేనేజర్ శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

‘వివక్ష చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్’

భూదాన్‌పోచంపల్లి: బీజేపీ కౌన్సిలర్ అయిన 3వ వార్డులో నిధులు ఇవ్వకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి వివక్ష చూపుతున్నారని కౌన్సిలర్ సుర్కంటి జ్యోతి ఆరోపించారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి పట్టణకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీకి మంజూరైన రూ.5.95 కోట్లలో ప్రతి వార్డుకు సీసీ రోడ్లు, డ్రెయినేజీల కోసం రూ.40 లక్షల నుంచి 50 లక్షలు ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని తెలిపారు. కానీ 3వ వార్డుకు కేవలం 300 మీటర్ల సీసీ రోడ్డు మంజూరు చేశారని తెలిపారు. సోమవారం జరిగిన కౌన్సిల్‌లోనూ ఈ అంశంపై తనను మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. సమావేశంలో బీజేపీ నాయకులు చిక్క కృష్ణ, మేకల చొక్కారెడ్డి, గంజి బస్వలింగం తదితరులున్నారు.

రెడ్డి ఆత్మీయ సమ్మేళన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

ఆత్మకూరు(ఎం): భువనగిరి పట్టణంలో ఈ నెల 22న నిర్వహించనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు రామిడి రాంరెడ్డి, జమ్ముల కృష్ణారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో సమ్మేళన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెడ్డిలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు బొబ్బల ఇంద్రారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.